క్లుప్తంగా

రూ.53 లక్షల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీ శేషాద్రికి చెక్కులు అందజేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు గురువారం రూ.53 లక్షల ఆస్తి పన్ను వసూలు చేశారు. అక్కిరెడ్డిపాలెంలోని సెవెన్ యాపిల్స్ నుంచి రూ.31.75 లక్షలు, ఉక్కునగరంలోని శివశివాని స్కూల్ నుంచి రూ.2.85లక్షలు, ఇతరుల నుంచి 18.40 లక్షలు వసూలు చేశారు. వీటికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్‌బి రెడ్డి మోహన్ తదితరులు గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రికి అందజేశారు. రెవెన్యూ అధికారుల కృషిని ఈ సందర్భంగా జెడ్సీ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి తిరుప్పావడ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకొని గురువారం స్వామిని తులసిదళాలతో అలంకరించారు. అనంతరం తిరుమలేశునికి విశిష్టమైన తిరుప్పావడ సేవను పులిహోర, స్వామికి ప్రీతిపాత్రమైన ప్రసాదాలను సమర్పించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.


సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 28, 29వ తేదీల్లో పెందుర్తిలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్.జగన్నాథరావు తెలిపారు. గురువారం భెల్ సంస్థలో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. సీపీఎం నాయకుడు జీ.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ మహాసభల్లో గత మూడేళ్లలో చేపట్టిన ఉద్యమాలు, ఇతర కార్యక్రమాలను చర్చించి రానున్న మూడేళ్లలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, కార్మిక సంఘాలను కలుపుకుని ముందుకు పోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఉరుకూటి బాబూరావు, సీతంనాయుడు, వి.ఆనందరావు, నారపురెడ్డి, ఎస్.అప్పారావు, పి.శివరాం, పి.వై.రమణారావు, కె.కిరీటం పాల్గొన్నారు.

రగ్గులు, స్వెటర్ల అందజేత



రగ్గులు, స్వెటర్లు అందజేస్తున్న నాయకుడు ముత్యాల నాయుడు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు పక్కన, బస్ షెల్టర్లలో కాలం వెళ్లదీస్తున్న వారికి స్వర్గీయ వంగవీటి మోహనరంగ అభిమానులు రగ్గులు, స్వెటర్లు అందజేశారు. వంగవీటి మోహన రంగ వర్ధంతి సందర్భంగా గురువారం 69వ వార్డు నాయకుడు కరణం ముత్యాల నాయుడు రెడ్డితుంగ్లాం గ్రామ నాయకులతో కలిసి బీహెచ్‌పీవీ బస్‌స్టాప్‌లో, రోడ్డు పక్కన ఉన్న నిరాశ్రయులకు రగ్గులు, స్వెటర్లతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భెల్ గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ, కంచిపాటి ప్రకాష్, సాలాపు మురళి పాల్గొన్నారు.

కామెడీ కింగ్

'నవ్వడం ఓ యోగం – నవ్వకపోవడం రోగం' అనే నానుడిని దృష్టిలో పెట్టుకుని ప్రజలను నవ్వించడం హాబీగా పెట్టుకున్నాడు. ఏ స్కిట్ వేసినా.. పలుకు పలికినా ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వాల్సిందే.. తనదైన ప్రతిభతో రికార్డులు కూడా నెలకొల్పాడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి వేముల భాస్కరాచారి. స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కరాచారి వ్యాఖ్యానం, కామెడీ స్కిట్స్ రచించి నటించడం, జోక్స్ చెప్పడం, నాటకాలకు దర్శకత్వం వహించడం ప్రవృత్తిగా మార్చుకుని పురస్కారాలు అందుకుంటున్నారు.

నవ్వులు పూయిస్తున్న ఉక్కు ఉద్యోగి

దర్శకుడిగానూ భాస్కరాచారి రాణింపు

పలు రికార్డులు, పురస్కారాలు సొంతం



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకుంటున్న భాస్కరాచారి



52 గంటల జోక్స్ రికార్డ్ నిర్వహిస్తున్న భాస్కరాచారి

ఉక్కునగరం: చిన్ననాటి నుంచి హాస్య చతురతతో అందరినీ అలరించే భాస్కరాచారి కామెడీ క్లబ్‌లో ఉత్సాహంగా పని చేస్తూ పలు కార్యక్రమాల్లో ప్రేక్షకులను నవ్వించేవారు. అదే స్ఫూర్తితో పలు పోటీల్లో పాల్గొని అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర స్థాయి కామెడీ స్కిట్స్, జోక్స్ పోటీల్లో ప్రథమ బహుమతులు గెలుపొందారు.

జాతీయ, అంతర్జాతీయ రికార్డ్స్ నమోదు

- ఇందులో భాగంగా 2013లో 'హాస్యలహరి' పేరుతో 52 గంటల 15 నిమిషాలు నిరంతరాయంగా జోక్స్ చెప్పి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, వరల్డ్ అమేజింగ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకునే ఘనత సాధించారు.
- 2023 ఏప్రిల్‌లో 12 గంటలు నిర్విరామంగా' అశువుగా హాస్యం' కార్యక్రమం ద్వారా సరికొత్త ప్రపంచ రికార్డ్ నెలకొల్పి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, అమేజింగ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు.

అందుకున్న గౌరవ పదవులు

- 2017లో అంతర్జాతీయ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా నియమితులై ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మందికి రికార్డ్స్ సాధించడంలో సహకారం అందిస్తున్నారు.
- క్రియేటివ్ కామెడీ క్లబ్‌కు అధ్యక్షుడిగా, వ్యాఖ్యాతగా, నిర్వాహకునిగా వ్యవహరిస్తూ ఇప్పటి వరకు 170 మందికి పైగా కళాకారులను సన్మానించారు.

ప్రభుత్వ సత్కారాలు

- 2021 నుంచి ఏటా విశాఖ జిల్లా యంత్రాంగం నిర్వహించే రిపబ్లిక్‌డే, స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.
- 2021లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నాటి జిల్లా మంత్రి కురసాల కన్నబాబు, 2021 గణతంత్ర వేడుకల్లో నాటి జిల్లా కలెక్టర్ మల్లికార్జున, 2023లో మంత్రి విడదల రజని, 2024లో నాటి పోలీసు కమిషనర్ రవిశంకర్ చేతుల మీదుగా అభినందన సత్కారాలు అందుకున్నారు.

ప్రకృతి ప్రేమికుడు

పర్యావరణ పరిరక్షణలో కూడా ఈయన తన వంతు పాత్ర పోషిస్తున్నాడు. యూత్ హాస్టల్స్ ఆధ్వర్యంలో 2008లో నిర్వహించిన హిమాలయ పర్వత శ్రేణుల్లోని 'కేదారి కాంత్' అనే పర్వతాన్ని అధిరోహించారు.

కళా సంస్థల పురస్కారాలు

- 2011లో వరల్డ్ థియేటర్స్ డే సందర్భంగా నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'రంగస్థల పురస్కారం' అందుకున్నారు.
- 2014లో 12వ యానాం పీపుల్స్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమంలో టూరిజం విభాగం వారిచే ఘన సత్కారం అందుకున్నారు.
- 2015లో విశాఖ ఫైన్ ఆర్ట్స్ అకాడమీచే హాస్య వైద్య శిఖామణిగా 'ఉగాది పురస్కారం లభించింది.



నాటి మంత్రి విడదల రజని నుంచి సత్కారం అందుకుంటున్న భాస్కరాచారి

పలు పురస్కారాలు...



- 2013లో నాటి మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖుల సమక్షంలో 'జాతీయ స్థాయి ఏకవీర పురస్కారం' అందుకున్నారు.
- 2014లో షిర్డీసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ' ఉక్కు పురస్కారం–2014' అందజేశారు.
- 2018లో హాస్య కళాకారునిగా చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ' హాస్యరత్న ప్రతిభా పురస్కారం' లభించింది.
- 2019లో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల 12వ వంశీకులు తాళ్లపాక హరినారాయణాచార్యులు చేతుల మీదుగా 'కళా సేవ పురస్కారం' అందుకున్నారు.
- 2022లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ' పొట్టి శ్రీరాములు సేవా రత్నం' పురస్కారం నాటి మంత్రి కొట్టు సత్యనారాయణ ' చేతుల మీదుగా అందుకున్నారు.

రంగస్థల పురస్కారాలు

- ఆరేళ్ల వయసులో తొలి రంగస్థల అనుభవం సీతాపహరణం నాటికలో సీతగా నటించి అందరి మన్ననలు అందుకున్నారు భాస్కరాచారి.
- 2008లో లగాబుస్ లచ్చన్న నాటికలో ఉత్తమ హాస్య నటుడు అవార్డును సినీ నటుడు కళ్ల చిదంబరం చేతుల మీదుగా అందుకున్నారు.

కార్మికుల బాధలు పాలకులకు పట్టవా?

- తక్షణమే వేతనాలు చెల్లించాలి
- భూ సేకరణ జరగని దానికి సీఎం చంద్రబాబు గునులు కోరుతారా?
- స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల బాధలను పాలకులు పట్టించుకోవడం లేదని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మండిపడ్డారు. కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసి భూసేకరణ కూడా జరగని ప్రైవేటు స్టీల్ ప్లాంట్‌కు ముడి ఖనిజం ఇవ్వాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ప్రకటనలు చేయడం తప్పా ఆచరణలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. గరిష్టంగా ఉత్పత్తి తీస్తున్న కార్మికులను పస్తులు పెట్టి జీఎస్టీ రూపంలో రూ. 380 కోట్లు ప్రభుత్వం ముక్కు పిండి వసూలు చేసిందన్నారు. యూనియన్ అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ, యాజమాన్యాల వైఖరిని ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు మౌనం వహించడం కార్మికుల దౌర్భాగ్యమన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ దగ్గర ఉన్న భూములను ప్లాంట్‌కు బదలాయిస్తే తన సొంత కాళ్లపై నిలబడి లాభాలు ఆర్జిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, టి.వి.కె. రాజు, డి.ఎస్.ఆర్.సి. మూర్తి, మరిడయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్ఐగా గణపతిరావు



పెదగంట్యాడ: న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జి.గణపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంచరపాలెం క్రైం ఎస్ఐగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన మహాలక్ష్మిని బదిలీ చేశారు.

కృష్ణమహంతి చెరువు కబ్జాపై విచారణ చేయాలి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

బంగారుమాంబ మాన్యం కూడా ఆక్రమణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో భూ కబ్జాలు, ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కృష్ణమహంతి చెరువుతో పాటు బంగారుమాంబ మాన్యాన్ని కూడా కబ్జా చేశారని.. అధికారులు సమగ్రంగా విచారణ చేసి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరారు. గ్రామంలోని బంగారు మాంబ ఆలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులు వినతులు స్వీకరించారు. అలాగే సర్వే నంబర్ 109లో భూముల మీద హక్కు కలిగిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, నాయకులు తెలిపిన అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ పరమైన కబ్జాలు, రోడ్లు, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై 65 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ మెంబర్ బోనెల జోసెఫ్, నాయకులు గవర వెంకటరమణారావు, గోపిశెట్టి గోపి, అక్కిరెడ్డి శ్రీనివాసరావు, ఎ.రాజు, వరహాలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని నోడల్ అధికారి శేష శైలజ అన్నారు. పెదగంట్యాడ తహసీల్దార్ అమల ఆధ్వర్యంలో నమ్మిదొడ్డి సచివాలయంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. 21 మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతులు అందజేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని , తమ భూములను 22ఏ నుంచి తొలగించాలని విన్నవించారు. అలాగే వక్ఫ్‌బోర్డు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు తమకు ఇంటి పన్నులు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ భాస్కర్, నాయకులు కాకి బాబు, పాల అచ్చింనాయుడు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సీఐఎస్ఎఫ్ మాక్ డ్రిల్



బిల్డింగ్‌లోకి ప్రవేశిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం



గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న సీఐఎస్ఎఫ్ బృందం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం బీసీఎస్‌వై యార్డ్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల కుప్పకూలిన నిర్మాణం, రెస్క్యూ అనే అంశంపై నిర్వహించిన మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. భూకంపం సంభవించడంతో ప్లాంట్‌లో భవనం కుప్ప కూలి బిల్డింగ్‌లో చిక్కుకోవడంతో కొంత మంది గాయపడినట్టు సమాచారం అందింది. వెంటనే జిల్లా అధికారులు, స్థానిక పోలీసులు, స్టీల్‌ప్లాంట్ అధికారులు, సీఐఎస్ఎఫ్ ఫైర్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, వైద్య బృందం, ఎన్‌డీఆర్ఎఫ్ యూనిట్ కమాండర్, భద్రతా విభాగానికి చెందిన అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బిల్డింగ్‌లో గాయపడిన వ్యక్తులను సురక్షితంగా తరలించారు. విశాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి. సురేష్ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించి అక్కడ ఏజెన్సీల సంసిద్ధతను వీక్షించారు. మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసినట్టు సీఐఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

స.హ.చట్టంపై అవగాహన లేదా?

అగనంపూడి: సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు కావస్తున్నా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు అవగాహన లేదని లేఖ పంపడం అన్యాయమని స.హ.చ కార్యకర్త పట్టా రామ అప్పారావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆర్టీఐ సెక్షన్ 4వన్ బీ ప్రకారం కార్యాలయంలో సిబ్బంది విధులు, బాధ్యతలు, వివిధ రూపాల్లో ప్రభుత్వం నుంచి విడుదల అయిన నిధుల వివరాలు కోరినట్టు తెలిపారు. దీనికి ఆర్టీఐ సెక్షన్‌పై అవగాహన లేదని, ఫోర్ వన్ బీ సెక్షన్‌లో పొందుపర్చిన 17 అంశాలపై అవగాహన లేదని వినియోగదారుల కమిషన్ కార్యాలయం పంపించడం అన్యాయమన్నారు. దీనిపై రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని ఆయన పేర్కొన్నారు.

బొగ్గుతో ప్రయాణికుల బేజారు



జాతీయ రహదారిపై బొగ్గు లారీల నుంచి నేలరాలిన బొగ్గు

అగనంపూడి: గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్‌ప్లాంట్‌కు లారీల ద్వారా తీసుకువెళ్తున్న బొగ్గు నేలపాలవడంతో ప్రయాణికులు బేజారెత్తుతున్నారు. నిత్యం వందలాది లారీలు కూర్మన్నపాలెం, అగనంపూడి, లంకెలపాలెం మీదుగా గంగవరం పోర్టు నుంచి రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో ఓవర్ లోడ్‌తో బొగ్గు లారీలు రాకపోకలు సాగించడంతో పాటు టార్పాలిన్ కప్పకపోవడంతో బొగ్గు పెద్ద పెద్ద ముక్కలు, గుండ ఎక్కడికక్కడే నేలరాలుతుంది. ఈ లారీల వెంబడి వెళ్లే ప్రయాణికుల మీద పడడం, కళ్లలో పడుతుండడంతో ప్రయణికులు బెంబేలెత్తుతున్నారు. అగనంపూడి టోల్‌గేటు పెట్రోల్ బంక్‌ల మధ్యలో బొగ్గు రోడ్డంతా చిందర వందరగా పడి ఉండడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. బొగ్గు రవాణా చేసే సమయంలో తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు నడుపూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: ఈ నెల 29, 30 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రం నుంచి సాయిచంద్, భార్గవి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీల కోసం ప్రధాన ఆటగాళ్లు ఏడుగురితో పాటు అదనపు ఆటగాళ్లు ఐదుగురిని ఎంపిక చేశారని తెలిపారు. ఆ విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు శ్రావణి, షమీమున్నీషా, కోచ్ వినయ్‌లను అభినందించారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

గాజువాక: మున్సిపల్ కార్మికుల సమస్యలపై గతంలో జరిగిన రాతపూర్వక ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు.

జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ పెన్షన్, ఎక్స్‌గ్రేషియా, బీమా, పీఆర్‌సీ విడుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటి అమలును పట్టించుకోవడం లేదన్నారు. ఈ అంశాల అమలుకు వచ్చేనెల 3వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, సోమాదుల గణేష్, బంగారు నాయుడు, సత్యం, మంగ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

రాజభాష అమల్లో టోలిక్ సేవలు ప్రశంసనీయం

ఉక్కు ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా



సమావేశంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్

ఉక్కునగరం: రాజభాష అమలుకు పట్టణ అధికార భాషా అమలు కమిటీ (టోలిక్) చేస్తున్న కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. సక్సేనా అన్నారు. ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో గురువారం టోలిక్ 16వ సమావేశం జరిగింది. సక్సేనా వర్చువల్ పద్ధతిలో టోలిక్‌కు చెందిన 'ఈ–ప్రస్తుతికిరణ్' ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 2023–24కు విశాఖ టోలిక్ ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే, హెచ్‌సీసీఎల్ ఈడీ ఆర్. రామకృష్ణన్ మాట్లాడుతూ టోలిక్ కార్యక్రమాలు హిందీ మరింత అమలుకు దోహదపడతాయన్నారు. 2024–25 మొదటి అర్ధ సంవత్సరంలో అధికార భాష అమలు ప్రగతిని సమీక్షించారు. అధికార భాష అమలు డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రీటా త్రివేది, స్టీల్‌ప్లాంట్ రాజభాష అధికారులు లలన్‌కుమార్, టి. హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని నిరసన



రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో జిల్లా పరిషత్ హై స్కూల్ పక్కన, దుర్గమాంబ, కుంచమాంబ ఆలయం వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టడంపై గ్రామ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతం వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో కొందరు ప్రధాన రోడ్డుతో పాటు గ్రీన్ బెల్టు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంగ్రాన అంజి, బాబూరావు, కాదా సత్యారావు, గౌరేష్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగాకు నివాళులు

అగనంపూడి: వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి మాట్లాడుతూ మోహన్‌రంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, మిత్ర మండలి అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, ఎస్.బాబ్జి, ఎం.శ్రీనివాసరావు, విందుల నారాయణరావు, ఐ.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

- 79వ వార్డు గళ్లవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మోహనరంగా చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గొల్లవిల్లి కనక భవాని, వెంకటరావు పాల్గొన్నారు.